


చార్మినార్ క్రాసు రోడ్ దగ్గర — సంగమ్ టాకీసు కెదురుగా వున్న పేవ్‌మెంటు మీద వాళ్ళిద్దరూ కూర్చుని వున్నారు. వాడిపేరు రంగడు, దానిపేరు చంద్రి. వాళ్ళకెదురుగా మాసిపోయిన గుడ్డ పరచి వుంది. దానిమీద చిల్లర డబ్బులున్నాయి. రంగడి వంటి మీద మాసిన చొక్కా, నిక్కరూ వున్నాయి. వాటికి తోడు బట్టలనిండా మాసిక లున్నాయి. వాడి జుట్టు తైల సంస్కారం లేక, ఉడతలు పీకిన తాట్టెంకలా చూడ్డానికి అసహ్యంగా వుంది. వాడి దృష్టి శూన్యంలోకి వుంది.

# పసుపుతాడు



రంగడికి పాతికేళ్ళ వయసుంటుంది.

చంద్రి వయసు దాదాపు పందొమ్మిదేళ్ళు. అది పొడగ్గా, పుష్టిగా వుంది. నల్లని వళ్ళు-చెయ్యి వేస్తే జారే బొమ్మిరాయిలా నిగనిగలాడుతోంది. ఒత్తయిన తలకట్టూ, చంపకి చారెడేసి కళ్ళూ, చిన్న నోరూ, పొడవైన నాసికా, ఎత్తయిన రొమ్ములూ....ఒక్క ముక్కలో చెప్పాలంటే దాని ప్రతి అవయవంలోనూ యవ్వనం తొంగి చూస్తోంది. దాని నుదుట కుంకుమ బొట్టుంది, మెడలో పసుపుతాడుంది, చేతులకి మట్టిగాజు లున్నాయి, జడలో బంతిపువ్వు వుంది. అది

కట్టుకున్న చీరకీ, జాకెట్టుకీ మాసిక లున్నాయి. అయితే అవి మాసి లేవు.

మూడ్నెల్ల క్రితం వాళ్ళిద్దరూ ఎక్కడ వుండేవారో పట్టించుకున్న వాళ్ళు లేరు. అక్కడికి మకాం మార్చినప్పటి నుండీ డబ్బులు బాగానే రాల్తున్నాయి. అసలు చంద్రి గొంతు విన్పించగానే ప్రజల దృష్టి రంగడి మీద పడదు. చూపులు చంద్రిమీద పడి, అక్కడే నిలిచిపోతాయి. దాని అవయవ సంపదను శల్య పరీక్ష చేస్తూ, తనివిదీరా కళ్ళతో అనుభవిస్తూ నిలబడి పోతారు.

"ఏటి బాబూ! అట్టా నిలబడి పోయావ్? గుడ్డోడికి దరమం సెయ్యవా?" అంటుంది చంద్రి.

వాళ్ళు మత్తువదిలి—అయిదు పైసలో, పది పైసలో గుడ్డమీద పడేసి జారుకుంటారు.

అందరిలాంటి వాడూ కాదు రాములు. రెండుపూట్ల పాతిక పైసలు వేస్తాడు. చంద్రివైపు ఓర చూపులు చూస్తాడు. రాములు పాతికేళ్ళవాడు. దగ్గరలో వున్న ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. చంద్రికి వాడిపేరు తెలీదు. ముచ్చటగా 'పాతిక పైసల బాబు' అని పిలుస్తుంది.

చంద్రి దృష్టిని సారించి బస్సు స్టాప్ వైపు చూసింది. అక్కడ రద్దీ ఎక్కువయింది. 'పాతిక పైసల బాబు ఇంకా రాలేదేటి?' అనుకుంది.

దూరాన రాములు వస్తూ కన్పించాడు. వాడు దగ్గరకు రాగానే- "ఏటి పాతిక పైసల బాబూ— ఇయ్యాలింత ఆలిస్సెమయి పోనాది?" అంది.

రాములు కొద్దిగా వగరుస్తూ దానివైపు చూసి-"నా పేరు పాతిక పైసల బాబు కాదు—రాములు" అన్నాడు

చంద్రి అందరినీ కసిరినట్లు వాడిని కసరలేదు. వాడి కళ్ళల్లోకి కళ్ళు గలిపి, "ఆ యమ్మ ఎన్ని పూజలు సేసిందో?" అంది.

"ఏ యమ్మ?"

"నిన్ను కట్టుకున్న యమ్మ."

"నన్నేయమ్మా కట్టుకోలేదు. నేనే కట్టుకుందా మనుకుంటున్నాను."

"ఆ యమ్మ ఎవరవుద్దో కాని మా సెడ్డ అదృష్టవంతురాలు."

రాములు సంభాషణ యింకా పెంచేవాడే! కాని ఫ్యాక్టరీకి టైము కావడంతో పాతిక పైసలు దాని చేతిలో పెట్టి, దాని ముఖంలోకి చూసి వెళ్ళిపోయాడు. చంద్రి వాడు వెళ్ళిన వైపే చూస్తూండి పోయింది. రంగడికి చంద్రి అందరితోనూ అలా మాట్లాడ్డం యిష్టం వుండదు.

ముఖం గంభీరంగా పెట్టి—"అందరితోనూ పరాచికాలాడకే—నాకు నచ్చదు" అన్నాడు.

చంద్రి వాడిమీద విరుచుకు పడింది-"నీ కోటి నచ్చుతాదేంట్రా? ఆ బాబు రెండు పూటలా దరమం సేస్తున్నాడు. నోటినిండా మాట్లాడితే మన సొమ్ము పోద్దేంటి?"

* * *

సాయంత్రం ఆరుగంటల వేళ-రాములు వచ్చేసరికి 'పేవ్ మెంటు' మీద చంద్రి ఒక్కతే కూర్చుని వుంది. రంగడి కోసం నలుమూలలా చూశాడు. కాస్త దూరంలో అరుగుమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాడు రంగడు. రాములికి సంతోషమైంది. 'గుడ్డోడికి చుట్ట అలవాటుందన్నమాట' అనుకున్నాడు. చాలా రోజులుగా చంద్రితో మాట్లాడాలన్నా వీలు పడ్డంలేదు. అందుకు కారణం రంగడు. వాడెప్పుడూ దాని ప్రక్కనే కూర్చుని వుంటాడు. ఇప్పుడు తామిద్దరిమధ్యా పానకంలో పుడకలా వున్న వాడ్ని తప్పించడమెలాగో తెలిసింది.

"చంద్రీ!"

చంద్రి కళ్ళింతవి చేసుకుని రాములివైపు ఆశ్చర్యంతో చూస్తూ అంది—"నా పేరు నీకెట్టా తెలిసింది పాతిక పైసల బాబూ?"

"నువ్వెంత వెర్రి మాలోకానివిలా వున్నావు. గుడ్డోడు నిన్ను చంద్రీ అని పిలవడూ?"

చంద్రీ సిగ్గుపడింది.

"ఓ మాట అడిగేదా చంద్రీ?"

"అడుగు బాబూ!"

"వాడైతే గుడ్డివాడు, నీలో ఏ లోపమూ లేదు కదా—ఇలా ముష్టెత్తుకో పోతే ఏదైనా పని చేసుకో కూడదూ?"

చంద్రి కొద్ది క్షణాలు మాట్లాడలేదు. చివరకు మెల్లిగా—"ఓ మాట అడగనా బాబూ?" అంది.

"అడుగు!"

"నేనెలా వుంటాను బాబూ?"

రాములు తడబడ్డాడు. చంద్రి ఆ ప్రశ్న ఎందుకడిగిందో వాడికి అర్థంకాలేదు. తను 'అందంగా వుంటావ'ని చెప్పాక అది తిరగబడితే? అల్లరిపెడితే? అనుమానంగా చంద్రి వైపు చూశాడు. అది అమాయకంగా కళ్ళింతవి చేసుకుని తననే చూస్తోంది. ధైర్యం వచ్చింది.

"నువ్వు చాలా అందంగా వుంటావు-అప్సరసలా వుంటావు-సినిమాలో 'ఈరోయిన్లా' వుంటావు" అన్నాడు.

"అంచేతే బాబూ—నాను పన్లో

కెల్లను. ఆడకూతురికి మానం పోయాక బతికేతే నేం? సత్తే నేం?"

రాములు మాట్లాడలేదు.

"ఓ పాలి నేనో ఇంట్లో పని క్కుదిరాను. ఆ యమ్మకి ఎప్పుడూ సుస్తీయే. ఆ బాబు బుర్ర మీసా లతో, బొర్ర పొట్టతో సూడ్డానికి దొంగోడ్లా వుండేవాడు. ఓ పాలి నేను ఇల్లు తుడుస్తావుంటే ఎనక నించొచ్చి నన్నట్టుకున్నాడు. సీపు రుతో కొట్టి పరిగెత్తుకొచ్చినా. మల్లీ పనిలో కెల్లలేదు. నువ్వే సెప్పు బాబూ-పనిలో కెలా ఎల్లేది?"

రాములు పాతిక పైసలు దాని చేతిలో పెట్టి, దాని కళ్ళల్లోకి చూపి వడివడిగా నడుస్తూ వెళ్ళి పోయాడు. చంద్రి వాడు వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయింది.

• • •

సాయంత్రం ఆరుగంటలు కావ స్తోంది. వీధిలో దీపాలు వెలిగాయి. రామదాసు బస్సుల్లో రద్దీ తక్కువై 'పేవ్ మెంటు' మీద రద్దీ పెరుగు తోంది. 'పాతిక పైసల బాబింకా రాలేదు' అనుకుంది చంద్రి. ఆ తర్వాత 'ఏ సినిమాకైనా పోయినా డేమో' అనుకుంది.

"సీకటడ్డాదేంటే సెందిరీ?" అన్నాడు రంగడు

చంద్రి సమాధాన మివ్వలేదు. అది వచ్చేపోయే వాళ్ళను చూస్తోంది. దాని మనస్సునిండా రాములు నిండిపోయాడు.

"ఏటే సెందిరీ! ఆ పరద్దాన్నం? సీకటడిందా అంటే ఇవ్వించు కోవ్?"

"అబ్బ—ఎట్టా నీ గోల? సీకటడితే నే సెప్పనా?" చంద్రి చిరాగ్గా అంది.

రాములు వస్తూ కవ్పించాడు. చంద్రిముఖం విప్పారింది. వాడు దగ్గరకు రాగానే- "ఏటి బాబూ- ఇంతాలిస్యమయినాది?" అంది.

"ఎవురే సెందిరీ?" రంగడు అడిగాడు.

"పాతికపైసల బాబు మామా!"

"దండాలు బాబూ!" రంగడు చేతులు జోడించాడు.

"ఒరే గుడ్డోడా! ఈ చుట్ట ముక్క కాల్చుకోరా" అంటూ రాములు వాడి చేతిలో ఓ చుట్ట పెట్టాడు.

రంగడికి పరమానందమైంది.

"సల్లంగా వుండు బాబూ!"

"ఒరేయ్! సుట్ట ఆ పక్క కెల్లి కాల్చుకోరా. ఇక్కడ కాలిస్తే దబ్బులేసేవాల్లు కూడా ఎయ్యరు."

"అరుగు కాడకి తీసుకెల్లు సెందిరీ?" అడిగాడు రంగడు.

చంద్రి రంగడ్ని అరుగుమీద

కూర్చోబెట్టి—"నే నాదకి పోయి కూర్చోనా మామాః" అంది.

"పోయే" అన్నాడు రంగడు.

చంద్రి తిరిగి వచ్చింది. రాములు అక్కడే విలబడివున్నాడు.

"చంద్రీః"

"ఏటి పాతిక పైసల బాబూః"

"నా పేరు పాతిక పైసల బాబు కాదు-రాములు."

"ఎందుకు బాబూ-పిల్చినావ్ః"

"ఓ సారి ప్రక్కకి వస్తావాః"

చంద్రి రాములివైపు ప్రశ్నార్థకంగా చూపింది. రాములు ముందుకు నడిచాడు. చంద్రి మారు మాట్లాడక వాడివి అనుసరించింది.

"ఇది నీ కోసం తెచ్చినాః" రాములు పొట్లాం దానికిస్తూ అన్నాడు.

చంద్రి పోట్లం విప్పి చూపింది. దాన్లో మిఠాయి వుంది.

"ఎందుకు బాబూ—నే నంటే నీకు అంత యాదిః"

"ఏమో తెలీదు."

"ఇపిత్రంగా మాట్లాడతావు బాబూః"

* * *

మరో రోజు సాయంత్రం అయిదున్నర గంటలవేళ—

రంగడు అరుగుమీద కూర్చువి రాము లిచ్చిన చుట్ట కాల్చుకుంటున్నాడు. ఆనందంగా

కాస్త దూరంలో రాములి ప్రక్కన విలబడి వుంది చంద్రి.

"ఓ మాట అడగాలవి వుంది చంద్రీః"

"ఏటి బాబూః"

"నే నెలాంటి వాడ్నిః"

"నువ్వు సాలా మంచోడివి బాబూః అందరూ నీలాటోల్లే వుంటే మా పొట్టలకి కరువేటి బాబూః"

"నువ్వంటే నాకు చాలా యిష్టం చంద్రీః"

చంద్రీ కళ్ళింతవి చేసి వాడివైపు చూస్తూ—"ఇయ్యాలిట్టా మాట్టాడతున్నావేటిః ఒంట్లో సరి లేదా బాబూః" అంది.

"వంట్లో సరిగానే వుంది కావి, గుడ్డోడు నీకేమవుతాడుః"

"ఎవురో అయితే నాకీ పాల్లెందుకు బాబూః"

"అంటేః"

"కట్టుకున్న వోడేః"

"కథలు చెప్పబోకు....గుడ్డోడు నిన్ను కట్టుకున్నవాడు కాదు."

చంద్రి ముఖం పాలిపోయింది.

"మీ అయ్యపేరు అప్పల్సామి. రిక్షా లాగేవాడు. ఓ లారీ మీ అయ్య రిక్షాని గుద్దింది. మీ అయ్య చచ్చిపోయాడు. మీ అమ్మ

తర్వాత చచ్చిపోయింది. గుడ్డోడు మీ యమ్మ తమ్ముడు. ఆడివి నువ్వు మనువాడలేదు. మానాన్ని రక్షించుకోడానికి వాడు నీ మొగుడని చెప్పుకుంటున్నావ్. మెడలో పసుపు తాడు కట్టుకున్నావు. అవునా?"

చంద్రి మాటలు కూడదీసుకుని మెల్లిగా—"ఎవరు సెప్పారు బాబూ?" అంది.

"ఎవరు చెబితేనేం? నిజమా-కాదా?"

చంద్రి హీనమైన స్వరంతో- "నిజమే బాబూ!" అంది.

"ఎంత కాలం వాడితో రోడ్డు మీద కూర్చుని ముష్టెత్తుతావు? వాడికి చాకిరీ చేస్తావు? వాడు నీ మొగుడని నాటకమాడతావు? నీకు మాత్రం పెళ్ళి చేసుకుని సుఖ పడాలని వుండదా? జీవితాన్ని వాడి కోసం ఎందుకు బలి చెయ్యాలి?"

"ఏం సెయ్యమంటావు బాబూ?"

"నువ్వంటే నాకు చాలా యిష్టం. మా యమ్మ ప్రాణాలు తీస్తోంది-బొట్టిని కట్టుకోమని. నాకు వచ్చిన దానివి నువ్వే. నిన్ను కట్టుకుంటాను. మా యమ్మకి నిన్ను గురించి చెప్పాను. సరేనంది. నీకు ముష్టెత్తాల్సిన పని వుండదు. నిన్ను సక్కంగా సుఖపెడతాను."

చంద్రి మాట్లాడలేదు.

"ఆలోచించు చంద్రీ! నువ్వంటే నాకు చాలా యిష్టం."

పాతిక పైసలు చంద్రి చేతిలో పెట్టి, రాములు వడివడిగా నడుస్తూ వెళ్ళిపోయాడు. చంద్రి వాడు వెళ్ళిన వైపే చూస్తూ చాలా సేపు నిలబడి పోయింది.

* * *

ఆ మరునాడు సాయంత్రం రాములు వచ్చేసరికి చంద్రి ఆలోచిస్తూ కూర్చుని వుంది. రంగడి చేతిలో ఓ చుట్ట పెట్టి వాణ్ని అరుగు మీద కూర్చోబెట్టి చంద్రి దగ్గరకు వచ్చి—"ఆలోచించావా చంద్రీ?" అన్నాడు రాములు.

చంద్రి వాడి వైపు చూసి తల దించుకుంది. రాములు కొద్ది క్షణాలు ఆలోచించి, చేతిలో వున్న పొట్లం దానికిస్తూ-"నీ కోసం తెచ్చినా" అన్నాడు.

చంద్రి పొట్లం విప్పి చూసింది. మల్లెల దండ వుంది. రాములు దాని ముఖంలో మెదిలే భావాలు చదవ ప్రయత్నించాడు. తనంటే చంద్రికి యిష్టం లేకపోతే ఆ దండ విసిరి కొడుతుంది. చంద్రి ఆ దండ వైపు చూస్తూ వుండి పోయింది.

"రేపాదివారం. పొద్దుటే నీ గుడిసె కొస్తాను. నీ కిష్టమైతే వచ్చేద్దువుగాని. మా యమ్మని తీసుకుని యాదగిరి గుట్ట కెళదాం—అక్కడ నిన్ను మనువాడతాను."

చంద్రి అవుననలేదు—కాదనలేదు. పువ్వుల్ని చూస్తూ వుండిపోయింది.

రాములు చంద్రి తనను కాదనదన్న ఆశతో వెళ్ళిపోయాడు.

చంద్రి రంగడి దగ్గరకు వెళ్ళి-"పదరా మామా—పోదాం" అంది.

రంగడు మల్లెల్ని చూడలేడు కాని, ఆ వాసనల్ని అనుభవించగలడు.

"మల్లె లోసన!" అన్నాడు చంద్రితో నడుస్తూ.

"అవును మామా—పాతిక పైసల దాటిచ్చాడు."

రంగడికి కోపం వచ్చింది—"ఛీ—ఛీ. పరాయి మొగోడు పూలిస్తే తీసుకోవచ్చటే?"

"ఏం తీసుకుంటే? నీ సొమ్ము పోద్దా?" చంద్రి వెటకారంగా అంది.

"నాకు నచ్చదు."

"నీకోటి నచ్చుతా దేంట్రా? నచ్చక పోతే నోర్మూసుకుని పడుండు—పతి దానికీ రాద్ధాంతం సేస్తావేం ఎప్పుడూ?"

రంగడు మరి మాట్లాడలేదు. చంద్రికి తనంటే చాలా యిష్టం. ఆలాంటిదాన్ని—'అనవసరంగా కోప్పడ్డానేమో! చంద్రికి కోపం వచ్చిందేమో!' అనుకున్నాడు.

"సెందిరీ! నాపై కోపం వచ్చినా దేంటే?"

"లేదులే."

"నువ్వు సాలా మంచి దానివి."

చంద్రి మాట్లాడలేదు. ఇద్దరూ గుడిసె చేరుకున్నారు.

రంగడు నులక మంచం మీద కూర్చుని ఆలోచిస్తూంటే—"ఏటి మామా-ఆలోచిస్తున్నావ్?" అంది చంద్రి.

"ఏటి లేదే! నిన్నో మాట అడిగేదా?"

"ఏటది మామా?"

"అందరూ మన్ని సూసి ఏటనుకుంటున్నారే?"

"ఏటనుకుంటారు? — నన్ను సూసి జాలిపడ్తున్నారు-గుడ్డోడ్ని కట్టుకున్నానని. ఆ ఇసయం ఇప్పుడెందుకు?"

"నేనంటే నీకు యిష్టమే కదే సెందిరీ?"

"నువ్వు త్త ఎర్రోడివిరా మామా! యిట్టం నేకపోతే నీతో

ఎందుకుంటాౖన్రా?" ఇన్నాల్లుగా?

రంగడు తేలిగ్గా నిట్టూర్చి—

"నీ మనసు తెలిపినాదే సెంౖదీ! సాలా సంతోషంగా వుందే! అందరూ నన్ను నీ మొగుడని అనుకుంటున్నారు. అల్ల మాటలు నిజం సేసేద్దామేటీ?"

అంతవరకూ పరధ్యానంగా సమాధానా లిచ్చిన చంౖద్రి అదిరి పడింది. కోపంగా వాడివైపు చూస్తూ—"అంతే?" అంది.

"నిన్ను నే మనువాడతానే?"

"ఏటి మాటాడతన్నావో అరద మౌతుందిరా? నన్ను మను వాడతావా? మతి పోయిందేంౖట్రా-ఇయ్యాల్టిట్టా మాట్లాడుతున్నావ్?"

"అదేటే-అట్టాగంటావ్?"

"ఒరేయ్! అంతలావు ఆసుండ కూడదురా! నువ్వు గుడ్డోడివని జాలిపడి నీకు సాకిరీ సేస్తావుంటే నువ్వనేది ఇదంౖట్రా? నీకు మాలావు ఆసలున్నాయిరా! నాకూ ఆసలున్నాయిరా! ఆడదానికి ఓ మనసుంటాదిరా! దాన్లో నచ్చినోడ్ని దాసుకుంటాదిరా."

"మాయప్ప ఏటంది? దానికి నువ్వు మాటియ్యనేదా?"

"మా యమ్మ ఏటంది? రంగడు గుడ్డోడు — సాయం సెయ్య మంది.... నీ కింత కూడు పడెయ్య మంది. జీయితాంతమూ కోరికల్ని సంపుకుని నీతో రోడ్డుమీద కూసుని ముష్టెత్తమన్లేదురా!"

"అంతేనా సెందిరీ?"

"అంతేరా మామా! మరో మాౖట్టా మామా—మా యమ్మ పోయినపుడు నీతో యేమన్నానో గురుతుందిరా? నాకు నచ్చినోడు దొరికేంతవరకూ నీకు సాకిరీ సేస్తా నన్నాను, నీకు తోడుంటానన్నాను. నిన్ను కట్టుకోననీ, నువ్వు యైర్రి ఏసాలే స్తే నా దారి నే సూసుకుంటా ననీ అన్నాౖన్రా."

"అయితే ఆ పసుపు తాడెం దుకు? నేను నిన్ను కట్టుకున్న వోడ్నని అందరికీ ఎందుకు సెప్పావ్?"

"నువ్వెత్త ఎౖర్రోడివిరా మామా! ఆ పసుపుతాడు నేనే కట్టుకున్నా-నువ్వు కట్టింది కాదు. ఈ లోకం గుడ్డిది. నువ్వు లోకాన్ని సూడ లేవు. నేను గుడ్డి లోకాన్ని సూస్తున్నా. ఈ లోకం గుడ్డోడి వని నిన్ను సూపి దరమం సెయ్యడంలేదు—నన్ను సూసి సెత్తంది. ఈ లోకం మా సెడ్డది. ఆడకూతురికి ఓ నీడంటూ కావాల. ఆ నీడలేకపోతే మగోడన్న ౖప్రతి వోడూ తన నీడలోకి లాగుదామని సూత్తాడు. ఈ పసుప్పతాడు వా

మానాన్ని నిలిపింది. పెజలింకా బరితెగించనేదు. ఇంకోడి అలి పెయ్యేట్టుకోడానికి జడుస్తారు. నీక్కావాల్పింది నీ సుకమని యిప్పుడే తెలిసొచ్చిందిరా! నేనే మయిపోయినా నీకు పర్లేదురా! ఇది నీకే యిస్తాను తీస్కోరా."

"ఏటది?"

చంద్రి మారు మాట్లాడక, పసుపు తాడు తీసి వాడి చేతిలో పెట్టింది.

"సెందిరీ!"

"నీ మీద మనసుపడ్డ ఆడ కూతురికి కట్టు. నా దారి నే సూసు కుంటాను."

రంగడు కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. "సెందిరీ! నువ్వెల్లిపోతే నాకు దిక్కెవరు?" అన్నాడు బొంగురు గొంతుకతో.

"పక్క గుడిసె గౌరి సాలా కాలంగా నా మీదపడి ఏడుస్తుందిరా — విన్నడ్డెట్టుకుని డబ్బులు సేసుకుంటున్నానని. దానికి సెప్తాను. 'సార్జి' తీసుకోమని."

"అంతేనా సెందిరీ?"

"అంతేరా! నే నిక నీతో వుండను.. ఆ బాబుకాడకే పోతాను. ఆ బాబు సాలా మంచోడు. నన్ను మనువాడతా నన్నాడు. నీతో కూర్చుని మాట్లాడాల్సిన కరమ


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్‌ను వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి
పేరు: ____________
విలాసము: ____________
____________ PIN ____________


కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్ —

వాకేం పట్టింది? గౌరి విన్ను సరిగా సూడకపోతే మా కాడకి వచ్చెయ్—ముద్ద పదేస్తాం."

"ఎవరా బాబు?" రంగడు ఉక్రోషంతో అన్నాడు.

"పాతిక పైసల బాబు. ఆ బాబుకి నేనంటే సాలా యిష్టం...నా క్కూడా ఆ బాబంటే సాలా యిష్టం. ఆ బాబు పూలిచ్చాడని నువ్వీరుసుకు పడ్డావుగాని, నేనెంత సంతోపించానో నీకు తెలవదు."

రంగడు మరి మాట్లాడలేదు.

ఆ రాత్రి మామూలుగానే చంద్రి రంగడికి అన్నం పెట్టింది.

నులక మంచంమీద పక్కవేసి వాడిని పడుకోబెట్టింది.

చాలాసేపు రంగడు ఆలోచిస్తూ పడుకున్నాడు.

వాడి మనసులో— చంద్రి తనను వదిలి వెళ్ళదన్న ఆశ కలిగింది.

'చంద్రికి కోపంవచ్చి అలా మాట్లాడింది గాని తనను వదిలి వెళ్ళదు!'

"సెందిరీ—నా మీద కోపం వచ్చినాదా?"

ఆ పక్కనే నేలమీద చాప వేసుకుని పడుకున్న చంద్రి-

"లేదులే— పడుకో" అంది ముభావంగా.

రంగడు తృప్తిగా నిట్టూర్చి నిద్రపోయాడు- చంద్రికి తన మీద కోపం లేదని మనసులోనే ఎంతో మురిసిపోతూ.

* * *

వంటిమీద ఓ దెబ్బపడటంతో రంగడు లేచి కూర్చున్నాడు ఉలిక్కిపడి.

"లెగరా— పొద్దెక్కిపోయింది. ఏటా మొద్దు నిదర?"

"ఎవరూ?"

"నేను గౌరిని."

"సెందిరీ! గౌరొచ్చిందే!" బిగ్గరగా అన్నాడు.

గౌరి నవ్వింది. "ఇంకెక్కడి సెందిర?—అదెల్లిపోయింది. ఇయాల్టినుండి నేనే నీకు తోడు. లెగు-లెగు. అలిస్సెమయిపోనాది. ఇయాల్టి నుండి కోలీ పోదాం. అక్కడ డబ్బులు బాగా రాల్తాయి. గంజినీల్లట్టుకొస్తా-లెగు" అంటూ వాడి సమాధానానికి ఎదురు చూడకుండా గబగబా బయటకు వెళ్ళింది గౌరి.

రంగడి హృదయం నిండా చీకట్లు అలముకొన్నాయి.

వాడి మనసులో గూడు కట్టుకున్న విషాదమంతా కరిగి కన్నీరై గుడ్డి కళ్ళవెంబడి ధారగా కురవ సాగింది. *